# ఉత్తరాల ఊర్వశి

పి.వి. రమణకుమార్






''హలో చందూ..''

''హాయ్ భద్రావతీ...''

పరుగు పరుగున ఇద్దరూ దగ్గరికొచ్చి ఆప్యాయంగా, అభిమానంగా చూసుకుంటున్నారు. మధ్యలో... వాళ్లిద్దరికీ మధ్యలో ఒక శాల్తీ దూరింది. అతను విసుగ్గా చూశాడు. ఆవిడా ఆ శాల్తీకేసి విసురుగా చూసింది.

''భద్రావతీ మనిద్దరి మధ్య దూరి మిడిగుడ్లేసుకుని మిర్రి మిర్రి చూస్తున్న ఈ పొట్టోడెవరు?'' అడిగాడు చందు.

''ఏం చెప్పను చందూ! ఆరు సంవత్సరాల క్రితం నువ్వు చెప్పా పెట్టకుండా దుబాయ్ వెళ్లిపోయావు. ఆ వెంటనే నేనీ పొట్టోడిని చేసుకోవాల్సి వచ్చింది'' కుమిలిపోతూ చెప్పింది.

''అంటే నీ ఆ...య...నా..!'' అంటూ రకామంటూ కాస్త దూరం జరిగాడు చందు భద్రావతీకేసి జాలిగా చూస్తూ.

''మరీ ఇంత పొట్టోడితో కాపురం ఎలా చేస్తున్నావ్ భద్రావతి?'' అన్నాడు బాధగా.

''ఏం చేయను మరి! ఈ జన్మకింతేనని సరిపెట్టుకుని వచ్చేజన్మలో నీ కోసం నా భర్త సీటు రిజర్వ్ చేసి వుంచుతాను చందూ... మనది ఏడేడు జన్మల బంధం. బోడి ఈ ఒక్క జన్మ పోయినా ఇంకా ఆరు జన్మలున్నాయి'' ఓదార్చింది భద్రావతి.

''జీవితంలో నేను చేసిన ఒక్క తప్పు నిన్నిలా శిక్షిస్తుందని ఊహించలేదు భద్రావతీ... ఊహించలేదు...'' అతను తీవ్రంగా వాపోతున్నాడు.

ఇంతలో అక్కడికి ఓ ఆటో వచ్చి ఆగింది. అందులోంచి ఐరావతం లాంటి ఆడది బరబరా వాళ్ల దగ్గరికి వచ్చి ''ఎవతె ఇది? నడిరోడ్డు మీద నకరాల్ చేస్తున్నావ్ బే! రా ఇంటికి నీ బొక్కలు లెక్కబెడతా'' అంటూ చందూ అనబడే అర్బకుడి పెడరెక్కలు విరిచి ఈడ్చుకుని ఎత్తి ఆటోలో వేసుకుని వెళ్లిపోయింది భారీ శాల్తీ.

''బాబోయ్ ఎవరీ ఐరావతం?'' అదిరిపడింది భద్రావతి.

''ఇంకా అర్థం కాలేదా, నీ పాతస్నేహితుడి పెళ్లాం. అందుకే అంత స్వేచ్ఛగా భర్తను ఈడ్చుకెళ్తోంది'' కసిగా చెప్పాడు భద్రావతి పొట్టి మొగుడు బీమా ఏజెంట్ భీమశంకరం.

''నా చందు ఈ లంకిణీని పెళ్లిచేసుకున్నాడా?'' వాపోయింది భద్రావతి.

''నేను శూర్పణఖలాంటి నిన్ను చేసుకోలా? నడిరోడ్డు మీద పాత పరిచయాలు చాలు. షాపులోకి పద...'' చెప్పాడు భీమశంకరం.

భారమైన హృదయంతో కదిలింది భద్రావతి. మండిపోతున్న కడుపుమంటతో 'పెళ్లాంకి టిట్ ఫర్ టాట్ ఎలా చెయ్యాలా' అన్న దిక్కుమాలిన ఆలోచనలో మునిగిపోయాడు భీమశంకరం.

★ ★ ★

పెళ్లయి ఆరేళ్లు గడిచేసరికి అందరిలాగే భద్రావతి, భీమశంకరానికి ఒకరంటే ఒకరికి తెగ బోర్ కొట్టేసింది. 'తనలాంటి అందగత్తెకు భీమశంకరం లాంటి పొట్టి గుండ్రాయి లాంటివాడు భర్తగా రావడం ఒక పెద్ద చారిత్రక తప్పిదంగా ఫీలైపోతుంటుంది అప్పుడప్పుడూ భద్రావతి.

భీమశంకరం కూడా కాలేజీ రోజుల్లో దసరా బుల్లోడికి తక్కువ. కిలాడీ బుల్లోడికి ఎక్కువగా కొన్ని లవ్ ట్రాక్స్ నడిపిన అనుభవం వున్నవాడే! పెళ్లయి ఆరేళ్లయినా పిల్లలు పుట్టకపోవడంతో భద్రావతి... ఆవిడ తరపు బంధువులు చిన్నచూపు చూడడం భరించలేకపోతున్నాడు.

ఎలాగైనా ఓ అందమైన అమ్మాయి చేత 'ఐ లవ్ యూ' చెప్పించుకుని పెళ్లాం పొగరు అణచాలని కసిమీద ఉన్నాడు. అందుకోసం ఈమధ్యనే 'పొడుగు పెరగటానికి చిట్కాలు కావాలంటే ఏడు వందలు ఎం.ఓ. చేయండి' అనే ఓ ప్రకటన చూసి డబ్బు ఎం.ఓ. చేసి పోస్ట్‌మాన్ కోసం చకోర పక్షిలా ఎదురు చూడసాగాడు.

అదేం చిత్రమో! అతను ఎదురుచూడడం ఆరంభించిన దగ్గర్నుంచీ ఆ వీధికి ఎప్పుడూ యథావిధిగా కాళ్లీడ్చుకుంటూ వచ్చే పోస్ట్‌మాన్ పోలయ్య అసలు రావటం మానేశాడు. ఇక ఉండబట్టలేక ఏకంగా హెడ్‌పోస్టాఫీసుకి బయలుదేరాడు భీమశంకరం.

''తొందరపడకయ్యా! పోస్ట్‌మాన్ పోలయ్యకు వడదెబ్బ తగిలి హాస్పిటల్లో పడ్డాడు. ఈరోజే వాలంటరీ రిటైర్‌మెంట్ కూడా తీసుకున్నాడు. రేపటి నుంచి ఆయన బదులు మరొకరు వస్తారు'' చెప్పాడు పోస్ట్‌మాస్టర్.

''ఎవరొస్తారు?'' ఉక్రోషంగా అడిగాడు భీమశంకరం.

''వాళ్లమ్మాయి ఊర్వశి.. ఆఫీసులో ఖాళీ లేదు, అందుకే పోస్ట్ ఉమెన్‌గా ఊర్వశి వస్తుంది''

''ఊర్వశి పేరు బాగుంది. పెళ్లయిందా లేదా?'' ఆత్రంగా అడిగాడు భీమశంకరం.

''అదంతా నీకెందుకయ్యా! రేపట్నించి యథావిధిగా మీ పరిచయాలు పోస్ట్ బట్వాడా అవుతుంది'' విసుగ్గా చిరిగిపోయిన స్టాంపుబిళ్లలా ముఖం పెట్టాడు పోస్ట్‌మాస్టర్.

''ఒకే సార్... థాంక్యూ. వస్తాన్ సార్..'' సంతోషంతో ఇంటికి బయలుదేరాడు భీమశంకరం. రాబోయే ఊర్వశిని ఊహించుకుంటూ...తీసుకురాబోయే చిట్కాలు తల్చుకుంటూ.

★★★

మర్నాడు మధ్యాహ్నం...

''ఏవండీ...'' అన్న పిలుపు... కోకిల కూసిందా? చిలుక అరచిందా? అనుకుంటూ ఇంట్లోంచి బయటకు వచ్చిన భీమశంకరం ఒక్కసారిగా షాక్ తిన్నాడు. అలాగే కరెంటు తీగపై కాకిలా బిగుసుకుపోయాడు. ఎదురుగా ఉన్న అందమైన అమ్మాయికి ముచ్చెమటలు పట్టాయి.

''ఏవండీ... ఏవండీ... ఏమైందీ?'' అంటూ చెంపలమీద ఫటా ఫటా కొట్టింది. ఆ దెబ్బలకు ''అబ్బా... అయ్యో...'' అంటూ షాక్‌లోంచి బయటకు వచ్చాడు భీమశంకరం.

''హమ్మయ్య... ఇలా షాక్ తిన్నవాళ్లని ఫటా ఫటా కొట్టమని మా నాన్న చెప్పాడు'' అంది.

''ఎవరూ? పోస్ట్‌మాన్ పోలయ్యా?''

''ఆయనే! వడదెబ్బ తిని వాలంటరీ పెట్టి నన్నీ ఉద్యోగంలో చేర్చాడు'' చెప్పింది.

''తింటే తిన్నాడుగానీ వడదెబ్బ... గారెదెబ్బ.. అబ్బ నీ తీయని దెబ్బలాంటి నిన్నీ ఉద్యోగంలో వేయించిన ఆ మహానుభావుడి త్యాగానికి దండేసి దండమెట్టాలి. నీ పేరు ఊర్వశి కదూ?'' పై నుంచి కింద దాకా ఆత్రంగా చూస్తూ అడిగాడు.

''అవును నేనే ఊర్వశిని. మా అక్క రంభకు పెళ్లయి ముంబయ్ పోయింది. మా చెల్లెలు మేనక పెళ్లి కాకుండానే కలకత్తా పోయింది''

''అంటే లేచిపోయిందా?''

''అబ్బే రిజర్వేషన్ చేయించుకుని బెర్త్‌పై పడుకునే పోయింది. కాకపోతే మాకెవరికీ చెప్పకుండానే పోయింది''

## పాపం ప్రియాంక!

ఓ టీవీ చానల్‌లో ప్రసారమవుతున్న 'ఖత్రోంకే ఖిలాడీ' సీజన్-3 కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ప్రియాంక చోప్రా ఆ ప్రోగ్రామ్‌ని అంతగా రక్తి కట్టించలేకపోతోందనే వార్తలు వస్తున్నాయిప్పుడు. ఇదే ప్రోగ్రామ్ రెండు సీజన్‌లకీ హోస్ట్‌గా వున్న అక్షయ్ కుమార్‌నే తరువాతి 'సీజన్-4'కి తీసుకోవాలని నిర్వాహకులు ఆలోచిస్తున్నారట. అయినా ఇలాంటి రియాల్టీ షోలకి మహిళా హోస్ట్ కంటే పురుష హోస్ట్ అయితేనే బావుంటుందనేది కూడా మరో టాక్. ఏదేమైనా పాపం ప్రియాంక చోప్రాకి ఈ విషయంలో సక్సెస్ లభించకపోడం కాస్త విచారకరమే.



''అర్థమైంది. మీ నాన్నకు తగిలింది వడదెబ్బ కాదు. మీ చెల్లెలు ఎస్కేప్ దెబ్బ... అది సరే! నా పేరు, ఇల్లు ఎలా కనుక్కున్నావ్?'' చనువుగా అడిగాడు.

''ఎవడో భీమశంకరం అనే పనికిమాలిన వాడొచ్చి పోస్టాఫీసులో ఆగం చేసి పోయాడని మా పోస్ట్‌మాస్టర్ గారు చెప్పారులెండి. ఈ ఏరియాలో కొచ్చి బీమా ఏజెంటు భీమశంకరం ఇల్లెక్కడా? అని అడిగాను. చాలామంది ఛీత్కారంగా చూశారు. ఓ ముసలాడు మాత్రం ఇక్కడిదాకా వచ్చి 'ఆ ఛండాలపోడి ఇల్లిదే' అని చెప్పి పోయాడు. ఇదిగోండి మీకు వచ్చిన పోస్ట్ కవర్...'' కట్టలోంచి కవరు తీసి చేతిలో పెట్టింది ఊర్వశి.

అప్పటిదాకా ఆమె మాటలు గుండె దిటవు చేసుకుని విని... బాధను దిగమింగుతూ కవరు అందుకున్నాడు భీమశంకరం. అది పొడుగు పెరగటానికి చిట్కాలు పంపించిన కంపెనీ వారి కవరు.

చించి, గబగబా చదివాడు.

''పొట్టివారిని పొట్టివారు అనగానే ఆవేదన చెందకండి. వెంటనే వెళ్లి ఎత్తుమడమల చెప్పుల జత కొనండి. ఎప్పుడూ మీకన్నా పొడుగున్న వారి పక్కన నిలబడకండి. మీకన్నా పొట్టివాళ్లతో తిరగండి. ఈ విధంగా కొన్నాళ్లు మనసులో యాతన పడతారు. ఆ తర్వాత చేసేదేం లేక అలవాటుపడతారు. కాబట్టి... ఊర్వశీ... ఊర్వశీ... టేకిటీజీ ఊర్వశీ... అని పాడుకుంటూ బ్రతికెయ్యండి''

ఉత్తరం పూర్తి చేయగానే, ఏడుపు గుండెల్లోంచి తన్నుకురాగా బావురుమన్నాడు.

''అయ్యో! ఎవరైనా పోయారా?'' అడిగింది ఊర్వశి

ఉత్తరంలోని ఆఖరి లైన్లలోని పాట గుర్తుకువచ్చింది. ''అబ్బే అదేం లేదు'' టేకిటీజీగా వెంటనే టాపిక్ మార్చేసి ''అది సరే! ఇంత అందమైన అమ్మాయివి ఇలా ఎండలో తిరిగితే టమాటా పండులా కందిపోవూ?'' అని అడిగాడు.

''మీరు పక్కనుంటే ఎండనేదే తెలియడం లేదు. అయినా డ్యూటీ తప్పదుగా! నేనసలే ఈ ఏరియాకి కొత్త. ఎలాగో తిరగాలి...'' గోముగా చెప్పింది ఊర్వశి.

ఆ మాటలతో దిమ్మెత్తిపోయాడు భీమశంకరం.

''ఎంతమాటన్నావు ఊర్వశీ? ఈ భీమశంకరం ఉండగా ఎండలో నిన్ను కందిపోనిస్తానా? ఉండు వస్తాను'' అని చెప్పి ఇంట్లోకి వెళ్లి పెద్ద గొడుగుతో తిరిగి వచ్చి, ఊర్వశికి ఎండ తగలకుండా గొడుగుపడుతూ-

''ఇక పద ఊర్వశి. ఈ ఏరియాలో పనికిమాలిన వాళ్లందరి ఉత్తరాలు డెలివరీ చేద్దాం. ఎల్.ఐ.సీ. ఏజెంట్‌ని కాబట్టి వీళ్ల అడ్రసులే కాదు, పుట్టుపూర్వోత్తరాలు అన్నీ నాకు తెలుసు'' అంటూ హడావిడి చేశాడు.

ఉత్తరాల కట్టతో ఊర్వశి, భీమశంకరం గొడుగు పడుతుంటే అతన్ని ఫాలో అయింది. సరైన వారికే చకచకా బట్వాడా చేయసాగింది. ఇదంతా చాటుగా గమనించిన భీమశంకరం భార్య భద్రావతి ఈర్ష్యతో రగిలిపోయింది.

అదే వీధిలో ఉంటూ అన్ని పత్రికలకు ఎడాపెడా ఉత్తరాలు రాసే ఉత్తరకుమార్ కూడా ఊర్వశి అందాలను చూసి పిచ్చెత్తినవాడిలా జుట్టుపీక్కున్నాడు.

అప్పటికప్పుడే కొన్ని ఉత్తరాలు ముందేసుకుని తన అడ్రస్‌కు తానే ఉత్తరాలు రాసుకోవడంలో నిమగ్నమయ్యాడు.

★ ★ ★

''ఇదేమైనా బాగుందా?''

''ఏమిటీ నా డ్రస్సా?''

''కాదు.. మీరా ఉత్తరాల పిల్లకు గొడుగు పడుతూ ఊరంతా ఊరకుక్కలా తిరగడం...'' కసిగా అంది భద్రావతి.

''మా కెమిస్ట్రీ బాగా కుదిరింది. ఇన్నాళ్లూ నీతో



## ఐశ్వర్య అని పిలవండి

ఐశ్వర్యారాయ్ బచ్చన్‌ని కొంత మంది 'ఐష్' అని 'అష్' అనీ పిలుస్తుంటారు. ఈ పిలుపు విషయమై గతంలో ఓసారి స్పందించిన ఐశ్వర్య- తాజాగా మరోసారి దీని గురించి మాట్లాడింది. ఇటీవల ఓ ఫ్యాషన్ షో సందర్భంలో ఈ ప్రస్తావన తీసుకొస్తూ 'దయచేసి నన్ను ఐశ్వర్య అని పిలవండి. అంతేగానీ అష్, ఐష్ అని పిలవకండి. నేను సినిమాల్లోకి వచ్చిన కొత్తల్లో కొంతమందికి నా పూర్తి పేరు పలకడం రాక కూడా అలా పొట్టిగా పిలిచేవారు. ఇప్పుడు ఇంత కాలమయ్యాక కూడా నా పూర్తి పేరుతో పిలవకపోడం కొంచెం బాధగానే వుంది' అంటూ వాపోయింది.

కెమిస్ట్రీ.. ఫిజిక్స్.. మేథ్స్.. ఏమీ కుదరక జీవితం ఇంతకాలం పాచిపోయిన పులిహోరలా తయారైంది. ఇకపై బాదం హల్వాలా.. క్యారెట్ జ్యూస్‌లా... రంజుగా వుంటుంది. ఇప్పుడిదంతా మామూలే. పెళ్లయి ఐదేళ్లయితే చాలు, ఎవరి ఎంజాయ్‌మెంట్ వాళ్లది'' అంతకంటే కసిగా చెప్పాడు భీమశంకరం. భద్రావతి ఖంగుతింది.

'ఒరి పొట్టిమొగుడా? నీకెన్ని తెలివితేటలురా!' అనుకుని 'జరిగేది జరక్క మానదని కూడా' అనుకుని సైలెంటుగా ఉండిపోయింది.

పత్రికలకు ఎడాపెడా ఉత్తరాలు రాస్తూ ప్రతి పత్రికలో తన ఉత్తరం తానే చదువుకుంటూ మురిసిపోయే ఉత్తరకుమార్ ఎలాగైనా ఊర్వశితో స్నేహం పెంచుకుని, ప్రేమలోకి దించాలని నిర్ణయించుకున్నాడు.

''హలో..మిస్...ఊర్వశి...'' అన్నాడు స్వీట్‌గా.

''మీరూ... మీరూ...?''

''ఉత్తరకుమారనీ... ఆయనకు ఆయనే ఉత్తరాలు రాసుకుంటుంటాడులే'' టకీమంటూ చెప్పాడు భీమశంకరం.

భీమశంకరాన్ని సర్కస్‌లో బఫూన్‌ని చూసినట్టు చూస్తూ- ''మీరీ ఏరియాకి ఉత్తరాల ఊర్వశిగా రావడం మాకు రోజా పండుగలా వుంది'' తన్మయత్వంగా చెప్పాడు ఉత్తరకుమార్.

''ఏదో.. అంతా మీ అభిమానం. ఇవిగోండి మీకు వచ్చిన ఉత్తరాలు. మీరు రచయితా?'' అడిగింది.

''భలే కనిపెట్టేశారే! నేను బిజీ రచయితను. అస్సలు తీరికే ఉండదు'' చెప్పాడు.

''కథలు రాస్తుంటారా? నవలలు రాస్తుంటారా?''

''ఉత్తరాలు రాస్తుంటాను. ఇప్పటికి పదేళ్ల నుంచీ అన్ని పత్రికలలో నావి మూడు వేల ఉత్తరాలు ప్రచురింపబడ్డాయి. పోయిన దసరాకు దంబోలా సాహిత్య సంస్థ వారు ఈ దశాబ్దపు ఉత్తమ ఉత్తరాల రచయితగా అవార్డునిచ్చి ఘనంగా సన్మానించారు, పేపర్లలో చదివేవుంటారు'' చెప్పాడు.

''ఇలాంటి చెత్త న్యూస్ చదవడానికేనా మేము పేపర్లు కొనేది?'' మధ్యలో కల్పించుకున్నాడు భీమశంకరం.

''ఇదిగో భీమశంకరం. మధ్యలో కల్పించుకుని వాగావంటే నీ నెత్తి మీద బస్తా ఉత్తరాలు పోసి నిప్పు పెడతాను. మాడి ఛస్తావ్...'' వార్నింగ్ ఇచ్చాడు ఉత్తరకుమార్.

భీమశంకరం నోరు మూసుకున్నాడు. ఊర్వశి కూడా భయం భయంగా చూసింది.

''మీరేం భయపడకండి. మీ ఉత్తరాల భారం ఐ మీన్ బ్యాగు భారం నా భుజం మీద పెట్టండి. హనుమంతుడిలా మోస్తాను. నడిచీ... నడిచీ... కందిపోయిన మీ పాదాలకు సాయంత్రం ఆయింట్‌మెంటు కూడా పూస్తాను'' వీర విధేయత ప్రదర్శించాడు ఉత్తరకుమార్.

మనసులోనే ఏవో లెక్కలు వేసుకుని ''సరే... తీసుకో..'' అంటూ ఉత్తరాల బ్యాగును ఉత్తరకుమార్‌కి అందించింది ఊర్వశి. అలా ఉత్తరకుమార్ బ్యాగు మోస్తుండగా... భీమశంకరం గొడుగు పట్టి అడ్రస్‌లు చూపిస్తుండగా చకచకా బట్వాడా చేసేసింది ఊర్వశి.

★★★

పది రోజులు గడిచిపోయాయి.

ప్రేమికులిద్దరూ ఎవరికి వారే పథకాలు రచించసాగారు. భీమశంకరం భార్య భద్రావతి, మొగుడికేదో పోయేకాలం దాపురించిందనుకుంది.

ఉత్తరకుమార్‌ని ఇంట్లోవాళ్లు 'ఊరికే తిరిగేవాడు ఇంట్లో ఉంటే ఏంటి? వీధిలో ఉంటే ఏంటి?' అనుకుని వదిలేశారు.

సరిగ్గా ప్రేమికుల రోజున తమ ప్రేమను తెలియచేయాలని నిర్ణయించుకున్నారు. ఆరోజు ఊర్వశి డ్యూటీకి సెలవుపెట్టిందని తెలుసుకుని, ఇద్దరూ ఒక్కటయ్యారు. ఇద్దరిలో ఎవరికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా రెండోవారు బొకే ఇచ్చి గ్రీటింగ్స్ చెప్పాలో నిర్ణయించుకుని పెద్ద పెద్ద బొకేలు తీసుకుని ఏకంగా ఊర్వశి ఇంటికే బయలుదేరారు.


ఊర్వశి ఇల్లంతా సందడి... సందడిగా తిరుగు

## ప్రీతీ రీఎంట్రీ

**సొట్టబుగ్గల సుందరి ప్రీతి జింతా కొంత కాలంగా ఏ సినిమాలోనూ నటించలేదు. రెండేళ్లుగా ఐపిఎల్ వ్యవహారాలతో బిజీగా వుండడం కూడా ముఖ్యమైన కారణంగా చెప్పుకోవచ్చు. 2011 ఐపియల్ టోర్నీ నుంచి పంజాబ్ టీమ్‌ని తొలగించడం వల్లనో ఏమో ఖాళీగా ఎందుకుండాలని కాబోలు తాజాగా ఆమె ఓ సినిమాలో నటించేందుకు ఒప్పుకుందిట. 'మేరే బ్రదర్‌కి దుల్హన్' అనే ఈ సినిమా సరికొత్త గ్లామర్‌తో ప్రేక్షకుల్ని అలరించబోతోందిట ప్రీతి.**



తున్న జనాలతో నిండి ఉంది. అక్కడున్న ఓ పెద్దాయన్ని ఆపి అడిగారు ''ఈ జనాలేంటండీ? కొంపదీసి పోస్ట్‌మాన్ పోలయ్య పోయాడా?'' అని. ఆ పెద్దాయన ఆ ఇద్దరినీ చెరో రెండు గుద్దులు గుద్ది ''మా బావ గారు పోయాడని కూస్తారా! అసలు ఎవర్రా మీరు? వాళ్లమ్మాయి ఊర్వశితో మావాడు అర్జున్‌కి నిశ్చితార్థం శుభమా అని జరుపుకుంటుంటే అపశకునం మాటలు మాట్లాడతారా? పనికిమాలిన వెధవల్లారా?'' అన్నాడు.




''అవును సార్... మేము పనికి మాలిన వాళ్లమే! సారీ సార్... ఇంతకీ ఊర్వశి ఎక్కడ సార్...'' ఏడుపుముఖంతో అడిగాడు ఉత్తరకుమార్.

''లోపలుంది వెళ్లి చావండి...'' చెప్పి హడావుడిగా వెళ్లిపోయాడు పెద్దాయన. సరాసరి లోపలికి వెళ్లి, సిగ్గుపడుతూ చక్కగా అలంకరించుకుంటున్న ఊర్వశి దగ్గరకు వెళ్లారు.

''ఊర్వశి ఇది చాలా అన్యాయం...'' ఏక కంఠంతో అరిచారు.

''ఏమిటి అన్యాయం?'' అంతకన్నా పెద్దగా అరిచింది.

''నిన్ను భూకంపంలా ఒకరం, సునామీలా ఒకరం దారుణంగా ప్రేమిస్తుంటే నీ మానాన నువ్వు మరొకర్ని పెళ్లి చేసుకోడానికి నిశ్చయించుకుంటావా?'' దబాయించి అడిగాడు భీమశంకరం.

అంతే! వారిద్దరి వీపు మీద ఛెళ్లు...ఛెళ్లు..మంటూ నాలుగు బెల్టు దెబ్బలు పడ్డాయి.

''బాబోయ్ ఏమిటీ హింస?'' కేకలు పెట్టారు.

''ఉడతలు పట్టే ముఖాలేసుకుని ఎవర్రా మీరు?'' అంటూ ఓ యువకుడు మీసాలు తిప్పుకుంటూ ముందుకి వచ్చాడు.

''తమిళ హీరోలా ఉన్న వీడెవడు?'' అడిగాడు భీమశంకరం.

''ఇతనే నా బావ అర్జున్. పోలీస్ ఇన్‌స్పెక్టర్ ట్రైనింగ్ పూర్తయి నిన్ననే వచ్చాడు. ఈరోజే మా నిశ్చితార్థం జరగబోతున్నది. మధ్యలో మీ గోలేంటి?'' సీరియస్‌గా అడిగింది ఊర్వశి.

అతని మీసాలు... చేతిలో బెల్టు... పర్సనాలిటీ చూస్తుంటేనే వెన్నులోంచి వణుకు పుట్టిన భీమశంకరం, ఉత్తరకుమార్ ఇద్దరూ అప్పటికప్పుడే ప్లేటు ఫిరాయించి, వారికి జరగబోయే పెళ్లికి అభినందనగా అడ్వాన్స్ బొకేలు అందజేసి ఉత్తరాల ఊర్వశిని ''నీ సుఖమే మేము కోరుతున్నాం'' అంటూ కుమిలిపోతూ ఆశీర్వదించి అక్కడ్నించి మరో బెల్టు దెబ్బ పడకముందే బైటపడ్డారు.

★ ★ ★

''నమస్తే భద్రావతీ...''

''నమస్తే చందూ...''

ఇద్దరి చూపుల్లోనూ గౌరవభావం. దగ్గరకొచ్చి ఆ ఇద్దరినీ చూస్తూ ''ఎవరేం అనుకున్నా.. ఆ బ్రహ్మరాతను తప్పించలేరు'' వేదాంతిలా చెప్పాడు మారిపోయిన భీమశంకరం.

''అవును అన్నయ్యగారూ! పతియే ప్రత్యక్ష దైవం అని కూడా చెప్పారు'' వినయవిధేయతలతో చెప్పింది అప్పుడే ఆటో దిగి అక్కడికొచ్చిన చందూ భార్య.

''పదండి అందరం అలా... గుడిలోకెళ్లి దేవుడి దర్శనం చేసుకుందాం'' తృప్తిగా చెప్పింది భద్రావతి.

అందరూ ఫాలో అయ్యారు. ☆



## హిమాలయాల్లో రజనీ...

**హిమాలయాలకు వెళ్లి రెండు మూడు వారాలపాటు అక్కడి ఆశ్రమాల్లో ప్రశాంత జీవనం గడిపి రావడం రజనీకాంత్‌కి చాలా కాలంగా వున్న అలవాటు. ఇటీవల కాలం రెండో కూతురు సౌందర్య వివాహం, రోబో సినిమా విడుదల, విజయయాత్రల్లాంటి వాటితో ఎంతో బిజీగా వుంటూ వచ్చిన రజనీ కొంత కాలం ఇలాంటి వాటన్నింటి దూరంగా వుండేందుకు హిమాలయాలకు చేరుకున్నాడట. ఇక్కడి ఆశ్రమాల్లోని ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతతను పొంది దీపావళి సరికి తిరిగి చెన్నయ్ చేరుకుంటాడని సన్నిహితులు అంటున్నారు.**